

# వర్షించని మేఘం

**ప్రొఫెసర్ సూరత్తు వేణుగోపాల రావు**

నలభై ఏళ్ల నాటి మాట. పత్రికల నిండా అంతరిక్ష యానం, బెర్లిన్ గోడ తెచ్చిన సంక్షోభం, నెహ్రూ అలీనోద్యమం, తాటి కాయలంత అక్షరాలతో ఆక్రమిస్తున్నాయి. ఆ యుగ సంధిలో శేఖరం అనే ఒక అజ్ఞాత వ్యక్తి పూర్వ స్నేహితుడిని కలుసుకోవడంలో ప్రత్యేకత ఏముంది ? అయితే ఆ చిన్న విషయానికే వార్తా పత్రికలు చాలా ప్రాముఖ్యాన్నిచ్చాయి. కారణం, కలుసుకున్నవాడు కేంద్ర మంత్రివర్గంలో ముఖ్యుడు - జగన్నాథం.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా శేఖరం అజ్ఞాతంగా ఎందుకు ఉండిపోయాడంటే సమాధానం తేలికగా దొరకదు. కేంద్ర మంత్రి జగన్నాథం తను పని చేస్తున్న కార్యాలయానికే వస్తున్నాడనీ, ఆ సందర్భంలో పెద్ద సభ జరుగుతుందని తెలిసినా, అతనిని కలవడానికి ప్రయత్నం చేయకపోవడం ఇంకా ఆశ్చర్యకరం! ఏదో ఒక మూల కూర్చున్న శేఖరాన్ని జగన్నాథమే చూశాడు. చూడడం ఏమిటి? గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరించి, సభాస్థలికి తనతోపాటు తీసుకు వెళ్ళి ఆదరించి అందరినీ ఆశ్చర్యంలో ముంచివేశాడు.

శేఖరానికి అదంతా ఒక కలలా అనిపించింది. ఒక దశాబ్దం పైగా తను అజ్ఞాతంగా జీవిస్తూ - గత జీవిత సంఘటనలను పూర్తిగా మరిచిపోయాడు. బొంబాయి వంటి మహా నగరంలో తానెవ్వరో, తన పుట్టు పూర్వోత్తరాలేమిటో ఎవరికి కావాలి? ఒక అనామకుడుగా సాధారణ గుమాస్తాగా జమా ఖర్చులు, లెక్కలు వేసుకుంటూ జీవితం గడిపాడు. ఏనాడూ ధనధాన్యాలూ, కీర్తి ప్రతిష్ఠలూ కోరుకోలేదు. అవి ఒకనాడు తన చేతి నుండి జారిపోయాయని విచారించనూలేదు. కాని, నేడు అనుకో



కుండా జగన్నాథం తనని ఆకాశానికి ఎత్తివేసి మహోన్నతుడైన విప్లవ కవి అని శ్లాఘించాడు. తెలుగు సాహిత్యంలోనూ, స్వాతంత్ర్యోద్యమంలోనూ శేఖరం చేసిన కృషి అమూల్యమంటూ భారత దేశం అతనికెంతో ఋణపడి ఉందని పెద్ద పెద్ద మాటలు చెప్పాడు. అక్కడ చేరిన జనానీకమంతా సంభ్రమంగా చూస్తున్నారు. 'ఇంతకాలం తమతో పని చేస్తూ, సతమతమైపోతున్న శేఖరం అంతటి వాడా ?!'

★ ★ ★ ★ ★

రాత్రి-నాటి అనుభవాన్ని పత్రికలలో చదువుతూ విశిష్టంగా ప్రచురించిన ఫోటోలు చూస్తుంటే శేఖరం మనస్సు గతంలోకి వెళ్లక తప్పలేదు. జగన్నాథం చెప్పిన మాటల్లో నిజం లేకపోలేదు. ఒకప్పుడు తన పేరు సాహితీ ప్రాంగణాలలో మారు మ్రోగింది. గ్రాంథిక సాహిత్యంపై ద్వజం ఎత్తి, ప్రబంధ రీతులను ఎదిరించి భాషా శృంఖలాలను ఛేదించుకుని, ఒక మనోజ్ఞమైన పాత్రతో సాహిత్య చరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభించాడు. శేఖరం సృష్టించిన లచ్చి గ్రామలక్ష్మి. పచ్చటి చేలల్లో, కొండ కోనల్లో, వాగుల్లో, కృష్ణా, గోదావరీ తీరాల్లో విహరిస్తూ తెలుగు సాహితీ ప్రపంచంలో విప్లవం తెచ్చింది. పండితుల్లో భాషా ఛాందసులు ఎంత ప్రయత్నించినా లచ్చి పాటలని అణిచి వేయలేకపోయారు. ఆ వల్ల పడుచు సాహిత్యంలో మరపురాని మనోజ్ఞ శిల్పంగా నిలిచిపోయింది.

జగన్నాథానికి లచ్చి పాటల సృష్టికర్త సహాధ్యాయుడు శేఖరమే అన్న సంగతి ఎలా తెలిసిందో? ఒక రోజు ఇద్దరూ ఆఫీస్ పని ముగించుకుని, చీకటి పడిపోయిన తరువాత, రోడ్డు మీద అప్పుడే వేసిన ఎలక్ట్రిక్ దీపాల వెలుతురులో నడుస్తుంటే, అకస్మాత్తుగా జగన్నాథం -

**"శేఖరం, నీ కవిత్వం మీద పండితులందరూ**
**ఏకమై ధ్వజమెత్తారని విస్ఫృహచెందకు,**
**ఈ ఝంఝూమారుతం తగ్గకపోదు,**
**తెలుగు సాహిత్యంలో నీ పేరు చిరస్థాయిగా**
**నిలిచిపోతుంది."**

అన్నాడు.


శేఖరం తికమక పడ్డ మాట నిజం. అది గమనించిన జగన్నాథం -

**"నీ కవితా రహస్యం నాకు తెలిసిందని బాధపడకు. అది ఎవరికీ తెలియనివ్వనులే!"**

అని సమాధానపరిచాడు.

అలా ప్రారంభమైన వాళ్ల స్నేహం దృఢమైంది. ఎన్నో సాయంత్రాలు, గోదావరీ తీరాన కూర్చుని సాహితీ చర్చల్లో కాలం గడిపేవారు. ఒక రోజు జగన్నాథం యథాలాపంగా "కవిత శయం మధురానుభూతులు కలిగించడమే కాదు. అది మన స్వాతంత్ర్యోద్యమాన్ని ఉత్తేజపరచాలి. చరిత్రకు జీవం పోయాలి. నిద్రాణమైన జాతిని కదిలించాలి. ఆ ప్రయత్నం చేయకూడదా!" అన్నాడు.

శేఖరం చకితుడై స్నేహితుడిని తేరిపార చూశాడు. జగన్నాథంలో నివురుగప్పి ఉన్న స్వాతంత్ర్యాగ్ని ప్రజ్వరిల్లుతోంది. ఉద్వేగంతో ఏదో అంటున్నాడనే కాని, తాలూకాఫీసులో గుమాస్తాగా నెలకు నలభై రూపాయలు సంపాదిస్తూ సంసారం నెట్టుకొస్తున్న తనకూ, స్వాతంత్ర్యానికీ సంబంధం ఏమిటి? తనలో ఒక నిగూఢమైన శక్తి ఉంది కాబట్టి, ఏదో రాశాడు. అది భవ్య మోహనమైన కవితా సృష్టిగా పరిణమిస్తుందని ఏనాడూ ఊహించలేదు. కాని నేడు తన కవిత్వానికి ఒక కొత్త మలుపు తేవడానికి జగన్నాథం ప్రయత్నిస్తున్నాడు. తానెక్కడ? స్వాతంత్ర్య సమరం ఎక్కడ? ఆ మహా యజ్ఞంలో ఒక సమిథ కాగలడా తను? శతాబ్దం పైగా పటిష్ఠమై పోయిన బ్రిటిష్ సామ్రాజ్యపు నిరంకుశ ప్రాకారాలు పద్యాలతో, పాటలతో కూలిపోతాయా? తను సంపాదించే నాలుగు రాళ్లకు ప్రతిఫలంగా పరాయి ప్రభుత్వానికి అజన్మాంతం అమ్ముడుపోయాడన్న నిజం కాదనుకోవడం భావ్యమా? స్వాతంత్ర్యోద్యమం నడవడానికి మహాత్ములు, యుగ పురుషులు, తుపాకీ గుండ్లకు ఎదుర్రొమ్ము నొడ్డగల ధీరోదాత్తులు కావాలి. తన సాధారణత్వంలో అలాంటి అచంచల ధైర్య సాహసాలు, త్యాగనిరతి ఉన్నాయనుకోవడంలో అర్థం



లేదు.

జగన్నాథం శేఖరాన్ని అలా మనస్సు తృప్తిపరచుకోనివ్వలేదు.

"నీవు నా ప్రాణ స్నేహితుడివి కాబట్టి చెబుతున్నాను. దేశమంతటా స్వాతంత్ర్య జ్వాల రేకెత్తుతున్నది. అది త్వరలో దావానలం కాకపోదు. అప్పుడు నేనూ అందులో దూకటానికే నిర్ణయించుకున్నాను. ఎందరో ఆహుతి అయితే కానీ స్వాతంత్ర్యంరాదని నీకూ తెలును. నీలో అనన్యమైన కవితా శక్తి ఉంది. ఆ శక్తిని స్వాతంత్ర్యోద్యమానికి చేయూత ఇచ్చేటట్లు ఉపయోగించమంటున్నాను. నువ్వు "సరే!" అను. మన జీవితాలకి ఒక అర్థం ఉంటుంది. ఏమంటావు?" అన్నాడు.

శేఖరం ఇదమిత్థంగా ఏమీ చెప్పలేదు. ఇంటికి వెళ్లాడేగాని మనస్సు పరిపరివిధాల పరిభ్రమిస్తోంది. రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నాడు. 'స్వాతంత్ర్యోద్యమం ముందుకు పోతున్నది కాని దేశాన్ని అధికార శృంఖలాలతో బంధించి దౌర్జన్యంగా పాలిస్తున్న తెల్ల దొరలను ఢీకొనడం సాధ్యమేనా? ఉద్యమాన్ని వాళ్ళు నిర్దాక్షిణ్యంగా నలిపివేయరా? అయినా సర్వస్వం వదులుకుని ఎందరో కారాగారాలలో కృశిస్తున్నారు. తనకా ధైర్యం, సాహసం లేకపోయినా, జగన్నాథం అన్నట్లు భగవంతుడు ప్రసాదించిన కవితా శక్తి ఉంది. ఆ శక్తిని దేశానికి అంకితం చేయడం తన బాధ్యత కాదా?'

శేఖరం చుట్టూ కలయచూశాడు. నేల మీద చాపలు పరచుకొని ఆదమరిచి నిదురపోతున్న భార్య, పిల్లలను చూస్తుంటే వాళ్ల భవిష్యత్తు ఏమిటి అన్న ఆలోచనాపరంపర. వాళ్లకు తను కావాలి. తాను సంపాదించే జీతం కావాలి. ఈ సంసార బంధాలు తెంచుకుని పోవడానికి తను ఏకాకి కాదు.

అలా ఒక పక్క తృప్తిపరచుకున్నా మనస్సు ఒప్పుకోలేదు. జీవితంలో బంధాలని, అనుబంధాలని లెక్కపెట్టుకుంటే ఎవరు నడుం కట్టుకుని ముందుకు వస్తారు? జాతి ఎలా మేలుకుంటుంది? ఇంతకాలం తన కవితా శక్తిని స్వాతంత్ర్య సాధనకి అంకితం చేయాలని అనుకోలేదు. కిటికీలో నుంచి ఆకాశంలో మిలమిలలాడుతున్న నక్షత్రాన్ని చూస్తుంటే శేఖరం మనస్సులో విపరీతమైన ఆవేదన కలిగింది. ఆ ఆవేదనలో నుంచి ఉద్భవించినవే అరుణ గీతాలు.

గొప్ప కవిత్వం ఎలా ప్రభవిస్తుంది? కాళిదాసు శాకుంతలం రాసినా, పోతన మహా భాగవతం రచించినా, ఆ రచనల వెనుక ఏదో ఆవేశం, ఆవేదన ఉన్నాయి. కవిత్వం సౌందర్యోపాసనలో, భగ్న ప్రణయాలలో, అందని మేఘాల్లో, సముద్రపు నీలిమలో, గలగలపారే సెలయేరుల్లో, హిమగిరి ధావళ్యంలో, ఇంద్రధనుస్సుల్లోనే లేదు. చుట్టూ అలముకున్న అంధకారంలో, దారిద్ర్యంలో, మానవ నిర్వేదంలో రాక్షసత్వంలో కూడా ఉంది. అదే శేఖరం వ్రాసిన గీతాలకి అపూర్వ విశిష్టతను చేకూర్చినాయి. "అరుణ గీతాలు" ఆంధ్ర దేశం అంతటా ప్రచారమయ్యాయి. ఆ గీతాల్లోని స్వాతంత్ర్య కాంక్ష ఎందరి మనస్సుల్లోనో నిప్పు రగిల్చింది. అదే సమయంలో జగన్నాథం ఉద్యోగం వదలి పరారైపోయాడు. అది 1942 సంవత్సరం.

మూడు సంవత్సరాల తరువాత ఉద్యోగ రీత్యా బదిలీ అయి శేఖరం మద్రాసుకెళ్ళాడు. సాయంత్రం ఇంటికి వస్తూంటే జగన్నాథం తారసిల్లాడు. అతన్ని గుర్తుపట్టడం కష్టమైంది. చాలా మారిపోయాడు. "క్విట్ ఇండియా" ఉద్యమంలో అజ్ఞాతంగా ఆంగ్ల ప్రభుత్వం మీద దాడులు జరిపి, నానా యాతనలు పెట్టిన జగన్నాథం చాలా నీరసపడిపోయాడు. తప్పించుకుపోవాలని ప్రయత్నించాడు. కానీ శేఖరం వదలలేదు. చివరకు బలవంతంమీద జగన్నాథం తన ప్రయత్నాలు, విజయ వైఫల్యాలు చెప్పాడు. ఇప్పుడు ప్రాణం తీసే రోగం దాపురించింది.

"నాకేమైతేనేం? ఒంటరి వాడిని. ఎక్కడో రాలిపోతాను. నేను కూడా స్వాతంత్ర్య సమరంలో ఒక అజ్ఞాత యోధుడుగా మిగిలిపోయిన తృప్తిచాలు" అన్నాడు.

శేఖరం మనస్సు కరిగిపోయింది. చూస్తూ చూస్తూ జగన్నాథాన్ని ఆ స్థితిలో విడిచిపెట్టిపోవడానికి మనస్కరించలేదు. "మా ఇంటికి తీసుకు వెళతాను. నా చేతనైనంత వరకు నీ ఆరోగ్యం బాగు చేయడానికి ప్రయత్నిస్తాను" అని నచ్చ చెప్పడానికి ప్రయత్నించాడు. జగన్నాథం ఒక పట్టాన ఒప్పుకోలేదు.


శేఖరం కూడా పట్టు విడవకుండా "ఆనాడు నీ మాట మీద అరుణ గీతాలు రాశాను. ఇప్పుడు నా మాట మన్నించు" అని ప్రాధేయపడి జగన్నాథాన్ని ఇంటికి తీసుకు వెళ్లాడు. ప్రథమ పరీక్షల్లోనే జగన్నాథం క్షయతో క్రుంగిపోతున్న సంగతి బైటపడింది. డాక్టర్ "మీ బావమరిదిని పిల్లల మధ్య ఉంచడం శ్రేయస్కరంకాదు. ఏ మదనపల్లికో తీసుకు వెళ్లండి" అని సలహా ఇచ్చాడు. ఆ సలహా పాటించడానికి శేఖరానికి శక్తి లేదు. చూస్తూ చూస్తూ ప్రాణ స్నేహితుడిని దిక్కులేని వాడిని చేయడానికి మనస్సు ఒప్పుకోలేదు.

భగవంతుడి మీద భారం వేసి మూడు నెలలు ఇంటిలోనే పెట్టుకుని సపర్యలు చేస్తూ, తనకు లేకపోయినా, అష్టకష్టాలుపడి అతనిని ఆరోగ్యవంతునిగా చేయగలిగాడు. ఆ రోజుల్లో అది అదృష్టమే. కోలుకున్నప్పటికీ జగన్నాథం "నేను ఇక్కడ ఉంటే నీకు ప్రమాదం సుమా" అని ఒకటే గొడవ. చివరికి ఒక రాత్రి ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు.

వారం రోజులు తిరగకుండానే జగన్నాథాన్ని అరెస్టు చేశారు. ఇక తన రహస్యం దాచడం కష్టం అన్న భయంతో శేఖరం సకుటుంబంగా బొంబాయి వెళ్లిపోయాడు. ఆనాటి నుండి శేఖరం స్మృతిపథంలో అదృశ్యమైపోయినట్లే.

ఒక దశాబ్ద కాలం గడిచిపోయింది. తాము కలలు కన్న స్వాతంత్ర్యం రానే వచ్చింది. జగన్నాథం పేరు రాజకీయాల్లో ప్రముఖంగా వినపడుతోంది. జాతి కోసం అపూర్వ త్యాగాలు చేసిన దేశభక్తుడుగా క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడిన యోధుడుగా కీర్తి ప్రతిష్ఠలు వచ్చాయి. చివరికి నెహ్రూ ప్రభుత్వంలో మంత్రిగా స్థానం నిలబెట్టుకున్నాడు.

ఈ పరిణామాలు అజ్ఞాతవాసంలో ఉన్న శేఖరానికి తెలియకపోలేదు. కానీ ఎందుకో తన స్నేహితుడిని కలవాలనిపించలేదు. చివరకు జగన్నాథానికి ఒక ఉత్తరం వ్రాయాలన్న భావం కూడా రాలేదు. ఇది నిర్లిప్తతా? లేక తనతోటివాడు - తనకు జీవితాంతం ఆప్తుడు - అత్యున్నత స్థానానికి చేరుకున్నాడన్న ఈర్ష్యా, లేక ఏదో సామాన్య సరళిలో జీవిస్తున్న తన ప్రపంచం మళ్ళీ అస్తవ్యస్తమైపోతుందన్న భయమా! ఇవన్నీ కారణాలు కావచ్చు. శేఖరం మాత్రం మళ్లీ



జగన్నాథాన్ని నేటి దాకా కలుసుకోలేదు.

సభానంతరం తనకెన్ని కార్యక్రమాలు ఉన్నా జగన్నాథం శేఖరాన్ని ప్రక్కకు తీసుకు వెళ్ళి ఆప్యాయంగా యోగక్షేమాలు అడిగాడు. "నేను ఈ ఉన్నత స్థితికి రావడం నీకు తెలియకుండా ఉందా? నీ కోసం ఎన్ని ప్రయత్నాలు చేశానో భగవంతునికి తెలుసు. ఒక కార్డు ముక్క వ్రాస్తే నీ దగ్గరకు వచ్చి వాలేవాడిని కదా!" అని చిరునింద వేశాడు.

శేఖరం ఏదో చెప్పబోయాడు. కానీ మాటలు రాలేదు. జగన్నాథాన్ని చూస్తూ ఆవేదనగా నిలబడిపోయాడు. అతని చుట్టూ ఎంత ఆడంబరం, ఎంత హంగామా, పోలీసులు సృష్టించిన అధికార శిబిరంలో జగన్నాథం రాజాధిరాజులా ఉన్నాడు. ఆనాడు మద్రాసులో కనపడ్డ జగన్నాథం కాదు. అధికార దర్పం, ఠీవి కొట్టవచ్చినట్టున్నాయి. చుట్టూ ఎందరో వంది మాగధులు, రాజకీయ నాయకులు, అతని చిరునవ్వు కోసం కాచుకుని ఉన్నారు. అదంతా చూస్తుంటే శేఖరం మనస్సు చెదిరిన మాట వాస్తవమే. జగన్నాథం ఇంతటి ఉన్నత స్థానానికి వచ్చాడంటే ఎన్ని రాజకీయ వ్యూహాలు ఛేదించాడో! ఎందరితో తలపడ్డాడో! మెట్టు మీద మెట్టు ఎక్కుతూ ఇంత పైకి వచ్చాడంటే ప్రతిభ, త్యాగం, సామర్థ్యమే కాదు కొంత కౌటిల్యం, క్రౌర్యం కూడా కావాలి. కాని అదంతా తనకు అనవసరం.

"వ్రాద్దామనుకున్నాను కాని ధైర్యం చాలలేదు" అని ముక్తసరిగా అన్నాడు.

జగన్నాథం విరగబడి నవ్వాడు. "నేను అల్పుడిని అనుకున్నావా? నీ స్నేహం, ఆత్మీయత, నా కోసం నువ్వు, సుభద్ర చేసిన మహా త్యాగం ఎలా మరచిపోగలను? ఈనాడేదో నాకు మంత్రి పదవి వచ్చిందని విరగబడిపోతాననుకున్నావా? రాజకీయాల్లో జయాపజయాలు కావడికుండలని తెలియని మూర్ఖుడిని కాదు. నేనూ నీ పాటివాణ్ణే" అని అన్నా శేఖరం తృప్తిపడలేదు.

ఇప్పుడు తనకూ, జగన్నాథానికీ మధ్య బ్రహ్మాండమైన అగాధం ఉంది. ఆ అగాధం శ్రీకృష్ణుడికి, కుచేలుడికి, మనిషికీ, మనిషికీ మధ్య జీవితంలోనే ఉంది. ఎప్పుడో స్నేహితులు కదా అని ఇవాళ భుజాలు రాసుకున్నంత మాత్రాన దానికి వారధి కట్టగలమా?

జగన్నాథం ఊపిరి సలపకుండా ప్రశ్న మీద ప్రశ్న వేస్తున్నాడు. "అక్కయ్య కులాసాగా ఉంది. కదా! పిల్లలు ఏం చేస్తున్నారు? నీ ఆరోగ్యం బాగుందా!"


"పెద్దవాడు రమణ ఇప్పుడే బి. ఏ. పాసైనాడు. ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. రెండవవాడు సత్యం ఇంకా కాలేజీలో చదువుతున్నాడు. అమ్మాయి, సేత పెండ్లికి ఉంది."

"ఇన్ని బాధ్యతలు పెట్టుకుని ఈ మహా నగరంలో ఎలా నెట్టుకొస్తున్నావు? పోనీలే, ఏమీ మించిపోలేదు. స్వాతంత్ర్యానంతరం మన సంస్కృతిని, సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. కళా, వైజ్ఞానిక సంస్థలూ, అకాడమీలు ఏర్పరచడానికి పథకాలు వేశాం. నీవు చేసిన సాహిత్య కృషి నిరుపమానమైనది. నీకు తగిన గుర్తింపు రావాలి. అది నా బాధ్యత. పిల్లలు, అక్కయ్యను చూడాలనీ, నీతో కొంత కాలం గడపాలని ఉన్నా అధికార బాధ్యతలు వీలుపడనీయవు కదా... మరోసారి వచ్చినప్పుడు వస్తాను... నువ్వు సంతోషంగా ఉన్నావు కదా!" అన్నాడు.

శేఖరం తల ఊపాడు. సంతోషం! ఏమిటో! ఒకప్పుడు సంతోషమంతా కవిత్వంలోనే ఉందనుకున్నాడు. కానీ ఆ కవిత్వమే తనను దూర దూర తీరాలకి తరిమి వేసింది.

వెళ్లిపోతూ చివరిమాటగా జగన్నాథం "నీ ఇంకా కవిత్వం రాస్తున్నావు కదూ!" అన్నాడు.

★ ★ ★



**నాటి** సంగతులన్నీ తలచుకుంటుంటే పూర్వ స్మృతులతో శేఖరం కళ్లల్లో నీళ్లు తిరిగాయి. పేపర్లో పడ్డ ఫోటో చూస్తుంటే మళ్లీ ఒక ఆవేశం ఉద్భవించి వెళ్లిపోతూ జగన్నాథం వేసిన ప్రశ్న మనస్సును కలిచి వేసింది. కొన్ని సంవత్సరాల తరువాత, ఈ రోజు మళ్లీ నూతన చైతన్యం కలుగుతున్నట్లనిపించింది.

శేఖరం అనాలోచితంగా బల్ల మీద కాగితాలు దగ్గరకు లాక్కున్నాడు. కానీ కలం ముందుకు సాగలేదు.

తనలో నిగూఢమైన భావోద్రేకం, సృజనాత్మక శక్తి ఎప్పుడో అదృశ్యమైపోయాయి కాబోలు. ఎంత ప్రయత్నించినా మళ్లీ ప్రత్యక్షం కావడం లేదు. అయినా ఈనాడు తనేమి కవిత్వం రాయగలడు? తన అపూర్వ సృష్టి లచ్చి ఎన్నడో సాహితీపథంలో వెనకపడిపోయింది. నాటి విమర్శలూ, వివాదాలూ, వాగ్యుద్ధాలూ చరిత్రలో మరుగునపడిపోయాయి. అరుణ గీతాలు మాత్రం ఇప్పుడు ఎవరిని స్పందింపజేస్తాయి?

స్వాతంత్ర్యం వచ్చింది కాని, దానితోపాటు అవినీతి, అధికార మదం, స్వలాభ పరాయణత్వం, రాజకీయ కౌటిల్యం కూడా వచ్చాయి. దారిద్ర్య రేఖ క్రింద కోట్లాను కోట్ల ప్రజలు అలమటిస్తున్నారు. హింస చెలరేగుతోంది. ఇప్పుడు తానేమి వ్రాసినా హాస్యాస్పదమే అవుతుంది. నేడు మరో ప్రపంచం కోసం కవులు ఆలపిస్తున్నారు. వాళ్ళు మానవ కాఠిన్యంలో, అసమానతలలో, దురాగతాల్లో, నిస్పృహలో, సాంఘిక దౌర్జన్యం, రక్తపాతంలో గుండె చెదిరే కవిత్వాన్ని సృష్టిస్తున్నారు. అలాంటి విప్లవ సాహిత్యానికి శేఖరం మానసికంగానూ, సామాజికంగానూ సిద్ధంగా లేడు.

మనస్సు మనస్సులో లేక శేఖరం బల్ల ముందు అచేతనంగా కూర్చుండిపోయాడు. రాత్రి పదకొండు దాటింది. ఇంట్లో పనులన్నీ ముగించుకుని సుభద్ర దగ్గరగా వచ్చి కూర్చుంది. "ప్రొద్దుటి సంగతి మీరు చెబుతుంటే నా కెంత ఉల్లాసం కలిగించిందో చెప్పలేను. జగన్నాథానికి ఉత్తరం వ్రాయండని నే నెంత ప్రాధేయపడినా నా మాట విన్నారు కారు! మీ ధోరణి మీదే!" అని ఎత్తి పొడిచింది.

శేఖరం మాట్లాడలేదు. నిజమే! తనొక పిచ్చివాడు కాబట్టే జీవితమంతా అజ్ఞాతంగా గడిపాడు. ఈ అజ్ఞాత వాసానికి అర్థమేమిటో తనకే తెలియనప్పుడు బాహ్య ప్రపంచానికి ఎలా తెలుస్తుంది?

సుభద్ర - "పోనీలెండి. అయిందేదో అయిపోయింది. నేటి కన్నా మనకు మంచి రోజులు వచ్చాయి. జగన్నాథం రమణకి మంచి ఉద్యోగం ఇప్పిస్తాడు. రెండోవాడి బాధ్యత ఆయన మీద వేస్తే తనకున్న పలుకుబడితో, రాజకీయాలలో తన స్థాయికి తీసుకురాడా? మీరంటే అతని కెంతో అభిమానం! మీరు తెలుగు సాహిత్యానికి చేసిన సేవకి తగినంత గౌరవం, ప్రతిష్ఠ తీసుకురాడా?" అన్నది.

శేఖరం ముభావంగా "నిజమే" అన్నాడు. సుభద్ర కళ్లు శేఖరం తీసుకున్న కాగితాల మీద పడ్డాయి. "బాగుంది! నే నెంత అడిగినా రచనా వ్యాసంగంలోకి నసేమిరా దిగనని ఇన్నాళ్ళూ భీష్మించుకున్నారు. జగన్నాథాన్ని చూసిన తరువాత మళ్లీ ఆ అభిలాష జనించింది కాబోలు. మంచిదే" అన్నది.

శేఖరం ఆమె కళ్లల్లోకి చూశాడు. సుభద్ర ఒకనాడు సౌందర్యరాశిగా, సుకుమార గాత్రిగా, మధుర మోహన మూర్తిగా లచ్చికి జీవం పోసింది. ఆమె విశాల నయనాలలోని కాంతి పుంజాలే తన కవితా సృష్టికి విశిష్టతని ఆపాదించాయి. ఇప్పుడు సుభద్ర ఇంటి చాకిరీతో, సంసార తాపత్రయాలతో నలిగిపోయింది. ముఖం ముడతలు పడిపోయింది. కళ్లు గుంటలు పడ్డాయి. కాని ఆమె నుదుటి మీద కుంకుమ బొట్టు మాత్రం దినదిన ప్రవర్ధమానమై తన జీవిత నౌకకి చుక్కానిగా మిగిలింది. "అలాగే! నువ్వు చెప్పినట్లే చేద్దాం! జగన్నాథం మనకు సహాయం ఎందుకు చేయడు?" అంటూ కాగితాలు వెనక్కి నెట్టేశాడు శేఖరం.

సుభద్ర చకితురాలై "ఏదో వ్రాద్దామని ప్రారంభించారుగా! మానేస్తున్నారేం?" అని అడిగింది.

"అవును! కానీ, ఇప్పుడు నాకా శక్తి లేదని కూడా గ్రహించాను" అన్నాడు శేఖరం.